ధాన్యం కొనుగోలు పరిశీలన

పెట్రోల్ బంకు సిబ్బందితో మాట్లాడుతున్న జిసిసి డిఎం

ప్రజాశక్తి - గుమ్మ లక్ష్మీపురం

మండలంలోని కుక్కిడి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిసిసి డివిజనల్ మేనేజర్ మహేంద్ర శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం నాణ్యతను పరిశీలించి తగిన గిట్టుబాటు ధర ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గిరిజన సహకార సంస్థ నిర్వాహణలో ఉన్న పెట్రోల్ బంక్‌ను కూడా పరిశీలించి రోజువారి అమ్మకాలను పెంచాలని ఆదేశించారు. ఆయన వెంట గుమ్మలక్ష్మీపురం జిసిసి మేనేజర్ వి.కృష్ణప్రసాద్, అకౌంటెంట్ గణపతి తదితరులు ఉన్నారు.

'ఈ ఏడాది ధాన్యం కొనుగోలులో సమూల మార్పులు చేశాం. మిల్లర్ల ఆగడాలను అరికట్టే విధంగా రైతులకు, మిల్లర్ల కు సంబంధం లేకుండా ఈ సారి ధాన్యం కొనుగోలు జరుగుతుంది. ఒక్క ధాన్యపు గింజ కూడా రైతులు మిల్లర్లకు అదనంగా ఇవ్వాల్సిన పని లేదు.' ధాన్యం కొనుగోలు పై ప్రభుత్వ పెద్దలుతో పాటు అధికారులు చెప్పిన మాటలివి. కానీ క్షేత్ర స్థాయిలో జరుగుతున్నది అందుకు భిన్నం. ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోలు చేసి మిల్లరుకు పంపించినంత వరకు సజావుగా జరుగుతున్నప్పటికీ, మిల్లర్లు ధాన్యం అన్‌లోడు చేసే సమయంలో అసలు పేచీ మొదలవుతోంది. ధాన్యం దించుకోవాలంటే, క్వింటాకు 5 కేజీలు అదనంగా ముట్టజెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. లేదంటే ధాన్యాన్ని దించకుండా రోజుల తరబడి ఉంచేస్తున్నారు. దీంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది.

కళ్లాల్లోనే ఉన్న ధాన్యం

క్వింటాకు 5 కిలోలు అదనం

కస్టోడియన్ అధికారులు ఏమాయ్యారు..?

మిల్లర్లు వద్ద రైతులకు సమస్య తలెత్తితే, వెంటనే ప్రభుత్వం నియమించిన కస్టోడియన్ అధికారులుగా ఉన్న రెవెన్యూ, సివిల్ సప్లయి అధికారులు చోద్యం చూస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి ఆర్‌బికెల్లో నాణ్యత ప్రమాణాలు చూసిన తరవాత ఆ ధాన్యం మిల్లర్లు దించుకోవాల్సిందే. కానీ మిల్లర్లు బహిరంగంగానే రైతుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. హమాలీ ఛార్జీలు మిల్లర్లకు చెల్లించనవసరం లేదని జేసీ చెబుతున్నా, మిల్లర్లు అసోసియేషన్ సభ్యులు పాత జీవో కాపీలను చూపించి, రైతుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు.

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలో ధాన్యం కొనుగోలులో మిల్లర్ల దోపిడీ ప్రారంభమైంది. రైతులంతా ఆర్‌బికెల్లోనూ ధాన్యం విక్రయించాలని అధికారులు చెబుతున్నారు. కానీ ఆర్‌బికెల్లో ధాన్యం కొనుగోలు చేసిన తరువాత వాటిని మిల్లర్లకు పంపడంతో అక్కడే దోపిడీ మొదలవుతోంది. క్వింటాకు 5కేజీలు అదనంగా ఇవ్వాలని, లేదంటే వంద రూపాయలు చొప్పున చెల్లిస్తేనే అన్‌లోడింగ్ చేస్తున్నారు. పైగా అన్ లోడింగ్ ఛార్జీలను కూడా రైతులు వద్దనుంచే మిల్లర్లు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ధాన్యం రవాణా వాహనాలను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేకుండా రైతులే ఏర్పాటు చేసుకోవాలని చెప్పడంతో రైతుల ఇబ్బంది పడుతున్నారు. మిల్లర్లు వాహనాలను రోజుల తరబడి నిలిపివేయడంతో ప్రైవేట్ వాహన యజమానులు ధాన్యం రావాణాకు ముందుకు రావడం లేదు. ఇప్పటికే కొంతమంది రైతులకు ధాన్యం విక్రయించిన నగదు వారి అకౌంట్లలో జమ అయినప్పటికీ గోనె సంచులు, రవాణా ఛార్జీలు, హమాలీ ఛార్జీలు మాత్రం జమ కాకపోవడంతో రైతులంతా తెల్లబోతున్నారు. కొన్నిచోట్ల రైతులు ధాన్యం సిద్ధంగా ఉన్నప్పటికీ నాణ్యత పరీక్షల్లో వ్యవసాయ శాఖ సిబ్బంది జాప్యం చేస్తున్నారు. ఆర్‌బికెల వద్ద ధాన్యం సంచుల సరఫరా నిలిచిపోవడంతో బహిరంగ మార్కెట్‌లో రూ.10 నుంచి రూ.12 కు కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. ఈ విషయమై వ్యవసాయ శాఖ సిబ్బందిని ప్రజాశక్తి ప్రశ్నించగా గోనె సంచుల కోసం ఇండెంట్ పెట్టామని, ఇంతవరకు సరఫరా జరగలేదని చెబుతున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ పై స్థాయి అధికారులు మాత్రం ధాన్యం సేకరణ అంతా సక్రమంగా జరుగుతోందని చెప్పడం గమనార్హం.

ఈ ఏడాది ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ అంతా గందరగోళంగా తయారైంది. అధికారుల ప్రకటనలకు, ఆచరణకు పొంతన లేకుండా పోయింది. గోనె సంచులు మొదలు రవాణా, హమాలీల కూలి అంతా అయోమయంగా మారింది. మిల్లర్లు క్వింటాకు 5కేజీల ధాన్యాన్ని రైతుల నుంచి అదనంగా డిమాండ్ చేస్తున్నారు. ఎందుకని ప్రశ్నించిన రైతుల ధాన్యాన్ని బస్తాలను దింపకుండా రోజుల తరబడి వాహనాలను నిలిపివేస్తున్నారు. పరిస్థితిని గమనించిన రైతులు అధికారులను సంప్రదించినప్పటికీ ఫలితం కనిపించడం లేదు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

జగనన్న కాలనీలకు విద్యుత్తు సదుపాయం

ప్రజాశక్తి - కలెక్టరేట్

జిల్లాలోని జగనన్న కాలనీలకు విద్యుత్ సదుపాయం కల్పించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆశాఖ అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీలలో మౌళిక సదుపాయాల కల్పనపై తన కార్యాలయంలో కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కాలనీలో విద్యుత్ సదుపాయం ఉండాలని, ఇళ్లకు కనెక్షన్లు ఇవ్వాలని స్పష్టం చేశారు. కాలనీల్లో మౌళిక సదుపాయాల కల్పనకు రూ.70 లక్షలు చొప్పున విడుదల చేసినప్పటికీ పనులు జాప్యం పట్ల అధికారులను ప్రశ్నించారు. ప్రాధాన్యత క్రమంలో పనులు వేగవంతం చేయాలని, జాప్యం జరిగితే సహించేది లేదని ఆయన అన్నారు. పాచిపెంట మండలంలో ప్రాధాన్యతలో భాగంగా తీసుకున్న కాలనీల్లో ఐదు రోజుల్లో కనెక్షన్లు ఇవ్వాలని, మిగిలిన కాలనీలకు మూడు నుండి పది రోజుల్లో కనెక్షన్లు ఇవ్వాలని ఆదేశించారు. పిఎం ఆవాస్ యోజన గ్రామీణలో 1680 గృహాలు ఐదు రోజుల్లో మంజూరు చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో ఆర్‌డిఒ కె.హేమలత, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రఘురాం, ఇఇ రమేష్, మునిసిపల్ కమీషనర్లు జె.రామఅప్పల నాయుడు, హెచ్. శంకర రావు, ఎస్. సర్వేశ్వరరావు, ఇపిడిసిఎల్ ఇంజినీరింగ్ అధికార్లు గోపాలకష్ణ, కె.వెంకటరత్నం, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ఓ. ప్రభాకర రావు, గహ నిర్మాణ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మృతుల పేరిట బిల్లులు డ్రా

ప్రజాశక్తి - సాలూరు

మండలంలో 2020-21,2021-22 సంవత్సరాల్లో చేపట్టిన ఉపాధి హామీ పనులకు సంబంధించి శుక్రవారం సామాజిక తనిఖీ నివేదికపై సదస్సు నిర్వహించారు. ఉపాధి హామీ ఎపిడి చంద్రమ్మ, సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ సూర్యనారాయణ, ఎపిడి శ్రీహరి ఆధ్వర్యాన సామాజిక తనిఖీ నివేదికపై చర్చించారు. ఉపాధిహామీ చట్టం కింద రెండేళ్లలో మండలంలో సుమారు 50కోట్ల పనులు జరిగాయి. వీటిలో జరిగిన అక్రమాలపై సామాజిక తనిఖీ నిర్వహించిన సిబ్బంది నివేదిక సమర్పించారు. 2018లో మరణించిన ముగ్గురు ఉపాధి కూలీల పేరిట 2021 వరకు బిల్లులు డ్రా చేసినట్లు సామాజిక తనిఖీల్లో గుర్తించారు. పట్టుచెన్నూరు, కొదమ పంచాయతీల్లో ఈ తరహా అక్రమాలు జరిగాయని గుర్తించడంతో రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. అన్నంరాజువలస పంచాయతీలో మొక్కలు నాటకుండా రూ.11,279 కాజేసినట్లు నిర్ధారణ చేయడంతో సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్‌లే మొక్కలు నాటి ఫొటోలు అప్లోడ్ చేయాలని ఆడిట్ అధికారి చంద్రమ్మ ఆదేశించారు. గత మూడేళ్లుగా గిరి శిఖర గ్రామాలకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం జరగకపోవడంతో ఆయా గ్రామాల్లో పనులు స్థానిక మేట్ల ద్వారా నిర్వహించారు. ఈ నేపథ్యంలో మేట్లు ఇష్టానుసారం అక్రమాలకు పాల్పడ్డారని స్పష్టమైంది. ఉదయం ప్రారంభమైన సామాజిక తనిఖీ సదస్సు సాయంత్రం 6వరకు కొనసాగింది. పంచాయతీ సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్లు సదస్సుకు హాజరయ్యారు. వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, ఎంపిడిఒ జి.పార్వతి, ఎపిఒ కృష్ణారావు, వైసిపి సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, సువ్వాడ రామకృష్ణ, భరత్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీలో అక్రమాలు వెలుగులోకి.. రికవరీకి ఆదేశాలు

ఎపిడి చంద్రమ్మకు నివేదికను వివరిస్తున్న సామాజిక తనిఖీ బృందం సభ్యులు

ఒక్క పూటే ఉపాధి పనులు చేయించాలి

సాలూరు రూరల్ : ఉపాధి హామీ పనుల కింద వ్యవసాయ కూలీలతో చేయించే పనులను ఒక్క పూటే చేయాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు అధికారులకు వినతిని అందజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీకి వచ్చిన అధికారులకు సమస్యను వివరించారు. రెండు పూటలా పనులు చేయడం వల్ల కూలీల ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు ఎక్కువగా వున్నందు వల్ల గతంలో వలే ఉపాధి పనులను ఒక్క పూటే చేయించాలని, సంవత్సరానికి 200 రోజులు పని కల్పించాలని, ప్రతి ఒక్క ఉపాధి కూలి రోజుకు 600 రూపాయలు వరకు కులీ ఇవ్వాలని కోరారు. వినతిని అందజేసిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు తాడంగి గాసీ, సభ్యులు సిద్దా సాయిబాబు, అప్పల నాయుడు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

మందులు అందుబాటులో ఉంచాలి

ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉండాలని ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్ అన్నారు. స్థానిక పిహెచ్‌సిని శుక్ర వారం ప్రాజెక్టు అధికారి తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, మందుల లభ్యత, ఒపి తదితర వివరాలను ప్రాజెక్టు అధికారి పరిశీలించారు. మందుల నిల్వ గది, క్యాజువాల్టీ ఇతర గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అత్యవసర మందులు అందుబాటులో ఉండాలని తెలిపారు. గర్భిణీల వివరాలు ఉండాలని, ప్రసవ సమయం తెలియజేసి ముందుగా ఆసుపత్రిలో చేర్చాలని సూచించారు. హైరిస్క్ కేసుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. రక్తహీనత గుర్తించాలని వారి పట్ల మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు. అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టిక ఆహారం అందుతున్నదీ లేనిదీ పరిశీలించాలని అన్నారు. అంటువ్యాధులతో సహా బిపి, మధుమేహం, కేన్సర్, తదితర వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. ఫ్యామిలీ డాక్టరు విధానం అమలను అడిగి తెలుసుకున్నారు. వత్తి పట్ల అంకిత భావం అవసరమని ఆయన పేర్కొన్నారు. అనంతరం స్థానిక ఎంపిడిఒ కార్యాలయాన్ని సందర్శించి మండలంలో జరుగుతున్న వివిధ పనులను ఆరా తీశారు. గృహ నిర్మాణంపై శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు.

పిహెచ్‌సిలో మందుల స్టాక్‌ను పరిశీలిస్తున్న పిఒ విష్ణుచరణ్

ఇష్టంగా చదవాలి

పార్వతీపురం : పార్వతీపురం మునిసిపాలిటీ పరిధిలో చాకలి బెలగాం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను పిఒ సందర్శించారు. విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడుతూ ఇష్టంగా చదవాలని, తద్వారా పాఠాలు బాగా అర్థం అవుతాయని చెప్పారు. ఏ అంశంలో సందేహాలుంటే వెంటనే సంబంధిత ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఉన్నత లక్ష్యం పెట్టుకోవాలని అందుకు తగిన విధంగా చదవాలని అప్పుడు అది సాధ్యమవుతుందని అన్నారు. పర్యటనలో వైద్యులు, ఎంపిడిఒ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్లాబ్ కూలి భవన నిర్మాణ కార్మికుడు మృతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక ఎస్‌విఎన్ నగర్‌లో శుక్రవారం భవనం స్లాబ్ కూలి భవన నిర్మాణ కార్మికుడు మృతి చెందాడు. ఫారెస్ట్ డిపార్టుమెంట్‌కు చెందిన చిరుద్యోగి పి.రామ్మోహనరావు ఇంటి నిర్మాణం చేపట్టారు. స్లాబ్ పనులు పూర్తయి సెంటరింగ్ తొలగిస్తుండగా స్లాబ్ కూలిపోయి నెల్లిమర్ల మండలం గొర్లిపేటకు చెందిన జమ్ము అప్పలనాయుడు అకడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మృత దేహాన్ని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. 2వ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భూ సమస్యలను పరిష్కరించుకోవాలి : సబ్‌కలెక్టర్

ప్రజాశక్తి -భామిని

భూరీసర్వేలోనే రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సబ్‌కలెక్టర్ నూరల్ కమర్ తెలిపారు. మండలంలోని గురండి, నేరడిలో ఇటీవల పూర్తి చేసిన భూ సర్వేపై స్థానిక భూ యజమానులతో సబ్‌కలెక్టర్ సమీక్షించారు. జగనన్న శాశ్వత భూ హక్కు -భూ రక్ష పథకంలో భాగంగా రెవెన్యూ భూ రికార్డు, రైతుల వద్ద ఉన్న రికార్డుల ఆధారంగా సర్వేయర్ భూ రీ సర్వే పూర్తి చేశారని, సర్వే భూమికి కొలత రాళ్లు ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, ఇంకా భూ హక్కుదారులు ఏవైనా భూ సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే రికార్డుల ప్రకారం పరిష్కరిస్తామని సబ్‌కలెక్టర్ తెలిపారు. అనంతరం ధాన్యం కొనుగోలుపై మాట్లాడుతూ ఆర్‌బికెలకు సమాచారం ఇస్తే, సాంకేతిక, వ్యవసాయ సహాయకులు క్షేత్ర స్థాయిలో ధాన్యం తేమ శాతం పరీక్షించి, పూర్తి ధాన్యాన్ని ఎఫ్‌టిఒ జనరేట్ చేసి ఇస్తారని, మిగిలిన పని కొనుగోలు సిబ్బంది చూసుకుంటుందని అన్నారు. ధాన్యం డబ్బులు రైతు ఖాతాలో జమ అవుతాయని తెలిపారు. ఆర్‌బికెలో ఇచ్చిన తేమ శాతాన్ని మిల్లర్లు పరిగణలోకి తీసుకోకుండా, మళ్లీ తేమ శాతం పరీక్షించి అధికంగా ఉందన్న నెపంతో పాలకొండ అప్పన్న రైస్ మిల్ వారు ధాన్యం దించకుండా నిలిపి వేశారని, అధికంగా హమాలీకి, లారీకి డబ్బులు చెల్లించాల్సి వచ్చిందని రైతు పోతల వెంకటరమణ ఫిర్యాదు చేశారు. రైతుకు, మిల్లర్‌కు ప్రేమేయం లేకుండా ఉండడానికి దూరంగా ఉన్న మిల్లర్లకు ధాన్యం తరలిస్తున్నామని, దీనివల్ల మిల్లరు రైతును ఇబ్బంది పెట్టే అవకాశం లేదని తెలిపారు. అనంతరం అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులు, పోషణ యాప్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా కొంతమంది రైతులు ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన వంశధార అదనపు పరిహారం తమకు అందలేదని, ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తోట సింహాచలం, తహశీల్దార్ అప్పారావు, సర్వేయర్ రామ్మోహన్, కార్యదర్శి లోవ అనసూయ, సర్పంచ్ బైరాగి, వ్యవసాయ సహాయకులు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

ధాన్యం రవాణాలో ఏర్పడ్డ సమస్యలను సబ్‌కలెక్టర్‌కు వివరిస్తున్న రైతులు

మన్యంలో మరణమృదంగాన్ని పట్టించుకోరా?

డిప్యూటీ సిఎంపై సంధ్యారాణి ఆగ్రహం

ప్రజాశక్తి - సాలూరు

అరుకు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలో ఉన్న మారుమూల ఏజెన్సీ గ్రామాల్లో సరైన వైద్య సదుపాయాలు లేక మాతాశిశు మరణాలు పెరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జి.సంధ్యారాణి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ అరుకు, పాడేరు, పెదబయలు, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో గడిచిన మూడేళ్లలో వందల సంఖ్యలో శిశు మరణాలు సంభవించాయన్నారు. కొద్దిరోజుల వ్యవధిలోనే ఐదుగురు శిశువులు మరణించారని చెప్పారు. అరుకు, పాడేరు, పార్వతీపురంలో వందపడకల ఆసుపత్రులున్నా తగినంత మంది వైద్యులు, మందులు లేని కారణంగా మరణాలు సంభవించాయని చెప్పారు. టిడిపి హయాంలో గిరిజన గర్భిణుల కోసం వసతి గృహాలు ఏర్పాటు చేస్తే వైసిపి ప్రభుత్వం వాటిని తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. డిప్యూటీ సిఎం రాజన్నదొర నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే పరిస్థితి చేయి దాటుతోందన్నారు. ఇప్పటికైనా గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర దృష్టి సారించకపోతే ఆందోళన తీవ్ర తరం చేస్తామని సంధ్యారాణి హెచ్చరించారు.



అనిల్‌కుమార్‌ను సత్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విద్య, క్రీడలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి -విజయనగరంటౌన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యకు, క్రీడలకు ఎంతో ప్రాముఖ్యత ఇస్తున్నారని రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఇటీవల కామన్వెల్త్ క్రీడల్లో బంగారు పతకం సాధించిన జిల్లాకు చెందిన బోదంకి అనిల్ కుమార్ శుక్రవారం డిప్యూటీ స్పీకర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోలగట్ల శాలువా కప్పి, పుష్పగుచ్ఛమిచ్చి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవంబర్ 24 నుండి డిసెంబర్ 4 వరకు న్యూజిలాండ్ లో జరిగిన 56 దేశాలు పాల్గొన్న అంతర్జాతీయ కామన్వెల్త్ క్రీడా పోటీలలో బొండపల్లి మండలం శామలవలస గ్రామానికి చెందిన బోదంకి అనిల్ కుమార్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని 83 కేజీల కేటగిరీలో బంగారు పతకం సాధించడం దేశానికి, జిల్లాకి గర్వకారణం అని అన్నారు. భవిష్యత్తులో అనిల్ కుమార్ మరిన్ని విజయాలు సాధించాలని అభిలాషించారు.

విద్యుత్తు తీగలే ఆధారం

ప్రజాశక్తి-మక్కువ

విద్యుత్ తీగలను ఆధారం చేసుకుని ఆ స్తంభం నిలబడి ఉందంటే ఆశ్చర్యం కలగకమానదు. ఇందులో ఏ తీగ తెగినా స్తంభం నేలకొరిగే భయానక పరిస్థితి నెలకొందని గిరిజన ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితి మక్కువ మేజర్ పంచాయతీ పరిధిలోని అంటివలసలో చోటు చేసుకుంది. స్తంభం ఏ క్షణం పడిపోతుందో అని గ్రామ ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు సమాచారం ఇచ్చినప్పటికీ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా తయారైన విద్యుత్ స్తంభాన్ని వెంటనే తొలగించి దాని స్థానంలో నూతన స్తంభాన్ని ఏర్పాటు చేయాలని గిరిజనులు కోరుతున్నారు

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభం

సేంద్రీయ ఉత్పత్తులకు మంచి రోజులు

ప్రజాశక్తి-విజయనగరం

సేంద్రీయ పద్ధతుల్లో సాగు చేసే పంట ఉత్పత్తులకు మంచి మార్కెట్ పరిస్థితులు ఉన్నాయని, వాటి వినియోగం ఈ మధ్యకాలంలో బాగా పెరిగిందని కలెక్టర్ ఎ.సూర్యకుమారి పేర్కొన్నారు. ఆధునిక పద్ధతులను అవలంభించి. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందే విధంగా సేంద్రీయ సాగు వైపు రైతులు మళ్లాలని పిలుపునిచ్చారు. మార్కెట్ బాగున్న పంటలను సాగు చేయాలని ఆర్థిక ప్రయోజనాలను పొందాలని సూచించారు. స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానంలో శుక్రవారం నిర్వహించిన కిసాన్ మేళాను ఆమె లాంఛనంగా ప్రారంభించారు. అక్కడ ఏర్పాటు చేసిన పలు వ్యవసాయ ఉత్పత్తుల, పరికరాల స్టాళ్లను ముందుగా సందర్శించారు. నూతన వంగడాల దిగుబడి ఫలాలను, ఎరువుల వినియోగం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె జిల్లాలో అవలంభించిన ఆధునిక పద్ధతుల ఫలితంగా దిగుబడులు పెరిగాయని, నవధాన్యాలు, చిరు ధాన్యాల ఉత్పత్తిలో పెరుగుదల బాగా కనిపించిందని పేర్కొన్నారు. ఖరీఫ్ సాగుకు వెళ్లే రైతులు నూతన పద్ధతుల గురించి ఆలోచించాలని, చిరుధాన్యాల సాగును ఆహ్వానించాలని సూచించారు.

ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు

కిసాన్ మేళాలో పాల్గొనేందుకు వ్యవసాయ పరిశోధనా స్థానానికి విచ్చేసిన కలెక్టర్ అక్కడ నెలకొల్పిన చిరు ధాన్యాల ఉప ఉత్పత్తుల తయారీ విభాగం, చిరుధాన్యాల శుద్ధి కేంద్రం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ విధాన విభాగం, బిస్కెట్ల తయారీ యూనిట్లను సందర్శించారు. వాటి ద్వారా వచ్చే ఆర్థిక ఫలాల గురించి అడిగి తెలుసుకున్నారు. యూనిట్ల పనితీరు, పరికరాల వినియోగం, ఉత్పత్తుల శుద్ధి గురించి అనకాపల్లి పరిధోశన విభాగం ఎడి డా.జగన్నాథరావు కలెక్టర్‌కు వివరించారు.

ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాలి

అనంతరం జరిగిన సభలో ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని వ్యవసాయ పరిశోధన విభాగం సంచాలకులు పి.రాంబాబు మాట్లాడుతూ పరిశోధన ఫలాలు అందరికీ అందేలా కిసాన్ మేళాలు దోహదం చేస్తాయని అన్నారు. రైతులు వరికి ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం సహాయ సంచాలకులు జగన్నాథరావు మాట్లాడుతూ పరిశోధకుల కృషి ఫలితంగా ఎన్నో విజయాలు సాధించామని తెలిపారు. అందరి కషికి ఫలితంగా 2023 సంవత్సరాన్ని చిరుధాన్యాల సంవత్సరంగా ఎఫ్ఎఒ గుర్తించిందని వివరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఫలితాలు మరిన్ని సాధించాలంటే పరిశోధనలు మరింత విస్తతం కావాలని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ జెడి వి.టి. రామారావు, డాట్ కేంద్రం కో-ఆర్డినేటర్ కె. లక్ష్మణ్, సీనియర్ సైంటిస్టు అనురాధ, సోయిల్ సైంటిస్టు సంధ్యారాణి, పలువురు శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

ఎఒతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ హేమలత

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

బలిజిపేట : ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌డిఒ కె.హేమలత రైతులకు సూచించారు. మండలంలోని పలగరలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించారు. మిల్లర్ల సమస్యలపై ఆరా తీశారు. గోనె సంచుల రవాణా, ఇతర సదుపాయాలపై ఆమె ఎఒ శ్రావణ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు ధాన్యాన్ని అమ్ముకోవాలని, దీనివల్ల రైతులకు ప్రయోజనం ఉంటుందని, దళారుల చేతుల్లో మోసపోవద్దని ఆమె తెలిపారు. ఆర్‌డిఒ వెంట ఎఒ శ్రావణ్ కుమార్, ఆర్‌ఐ రమణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ రవణమ్మ

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చినమేరంగి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్ అల్లు రవణమ్మ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తాడేల మన్మధనాయుడు, పిఎసిఎస్ సిఇఒ బొత్స రామారావునాయుడు, ఎమ్మెస్ఎంఇ డైరెక్టర్ ఎం.గౌరీశంకర్రావు పాల్గొన్నారు.

వృద్ధ కళాకారుడికి సన్మానం

బలిజిపేట : మండలంలోని తుమరాడకు చెందిన చాకరాపల్లి ఈశ్వరరావు అనే వృద్ధ కళాకారుడ్ని నూకలవాడకు చెందిన ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. తొలుత ఆయన్ను దుస్సాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన దేశభక్తి గీతాలు ఆలపించి ఉపాధ్యాయుల నుంచి మన్ననలు పొందారు. ఆయనకు ఇది 83వ సన్మానంగా పేరు తెచ్చి పెట్టినట్లు కళాకారుడు ఈశ్వరరావు తెలిపారు. సన్మానించిన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ కృష్ణమహేష్‌రెడ్డి

సచివాలయ సందర్శన

సీతానగరం : మండలంలోని పెదలంకలం గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ బి.కృష్ణమహేశ్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది రికార్డులను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ వచ్చిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా కృషి చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్నం భోజనం పథకాన్ని పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఇఒపిఆర్‌డి కెకె వర్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

పార్వతీపురం టౌన్ : స్థానిక డివిఎం ఉన్నత పాఠశాలలో క్లీన్ ఆంధ్ర ప్రదేశ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌పై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు బహుమతులను ప్రధానం చేశారు. అనంతరం విద్యార్థులకు స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ నిర్మాణం, క్లీన్ ఆంధ్ర ప్రదేశ్‌లో భాగంగా తడి, పొడి చెత్తలను వేరు చేసే విధానాలను, బయో ఎరువు తయారీపై కమిషనర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డివిఎం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోవిందరావుతో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్వరలో ట్యాబ్‌లు పంపిణీ

వీరఘట్టం : ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు త్వరలో ట్యాబులు పంపిణీ చేయనున్నట్లు ఎంఇఒ పి.కృష్ణమూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 180 మంది విద్యార్థులకు త్వరలో వీటిని పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే తమ కార్యాలయానికి ట్యాబులు వచ్చాయని, పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

18న చలో పార్వతీపురం

జియ్యమ్మవలస : బోయ, వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దని, శ్యామల్ ఆనంద్ కుమార్ కమిషన్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న చలో కలెక్టరేట నిర్వహించనున్నట్టు ఆదివాసీ గిరిజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి నాయకులు ఆరిక చంద్రశేఖర్, దుక్క సీతారాం, పల్ల ఒకప్రకటనలో పేర్కొన్నారు. కెజిబివి, ఏకలవ్య పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బందిని స్థానిక ఆదివాసీలతోనే భర్తీ చేయాలని, జిఒ 3 బదులుగా కొత్త చట్టం తీసుకురావాలని, పక్క రాష్ట్రం వలె గిరిజనులకు రిజర్వేషన్ 10శాతం పెంచాలని కోరుతూ ఈనెల 19న పార్వతీపురంలోని రాయగడ రోడ్ నుంచి కలెక్టరేట్ వరకు జరుగు నిరసన కార్యక్రమానికి జిల్లాలోని ఆదివాసీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజప్రతినిధులు, గిరిజన ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగ సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

మహాసభల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పారిశుధ్య కార్మికులు

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

పాలకొండ రూరల్ : ఈనెల 20, 21, 22 తేదీల్లో అనంతపురంలో నిర్వహిస్తున్న మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఫెడరేషన్ పాలకొండ అధ్యక్షులు కార్యదర్శి పి.భాస్కరరావు, సిహెచ్ సంజీవి, పి.వేణు కోరారు. శుక్రవారం మహాసభలకు సంబంధించిన కరపత్రాలను వారు విడుదల చేశారు. రాష్ట్రంలో 123 మున్సిపాలిటీల్లో ఉన్న రెండు కోట్ల మంది ప్రజలకు పౌర సేవలు అందిస్తున్న కార్మికుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని చెప్పారు. కరోనా సమయంలో ప్రాణాలను సైతం తెగించి కార్మికుల సేవలు అందించారని గుర్తు చేశారు. కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సభ్యులు విమల, శ్రీదేవి, మధు, రామారావు, సాయి తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ఓట్లతో 40 ఏళ్లు పాలించారు

'ఇదేం కర్మ' కార్యక్రమంలో శత్రుచర్లపై దత్తి నిప్పులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజనుల నిరక్షరాస్యత, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కోటలో ఉన్న నాలుగు ఓట్ల తోనే 40 ఏళ్ల పాటు పాలించి గిరిజనులను పూర్తిగా మోసగించారని మాజీ ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజునుద్దేశించి గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు దత్తి లక్ష్మణరావు విమర్శించారు. మండలంలోని లోవముతా ప్రాంతమైన రేగిడి, గొరడ గిరిజన గ్రామాల్లో ఇదేం కర్మ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం గొరడలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల కాలంలో కేవలం మూడుసార్లు మాత్రమే గిరిజనులు ఎమ్మెల్యేలుగా కొనసాగారని అన్నారు. మిగిలిన కాలంలో నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలతో గిరిజనులను మోసగించి ఇంతవరకు రాచరిక పాలనతో ఎమ్మెల్యేలుగా, మంత్రులుగా చలామణి అయ్యారని విమర్శించారు. దీంతో గిరిజన అభివృద్ధి పూర్తిగా నిర్వీర్యమైందన్నారు. ఇప్పటికైనా గిరిజనులు మేల్కొని నిజమైన గిరిజన అభ్యర్థిని రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిపిస్తే బతుకులు బాగుపడతాయన్నారు. టిడిపి సీనియర్ నాయకులు బిడ్డిక పద్మావతి మాట్లాడుతూ గిరిజన హక్కులను దోచుకుంటూ నకిలీ ధ్రువీకరణ పత్రాలతో ఇంతకాలం రాజ్యమేలిన రాజుల పాలనకు చమర గీతం పాడాలని గిరిజనులకు పిలుపునిచ్చారు. నిజమైన గిరిజనులను గెలిపిస్తే హక్కులు, చట్టాలను కాపాడుకునేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమానికి ముందు రేగిడి, గొరడ గ్రామాల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను గిరిజనులకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి ఆశావాహులు పువ్వల లావణ్య, ఆర్‌ఎస్‌ఎస్ విజయ్ కుమార్, తాడంగి రామారావు, మాజీ ఎంపిపి

గుమ్మలక్ష్మీపురం : గొరడలో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

రమణమూర్తి, తాడంగి లక్ష్మణరావు, కొండలరావు, రామారావు, జమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

తాడికొండ, ఎగువతాడికొండలో....

ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం తాడికొండ పంచాయతీ పరిధిలో గల తాడికొండ, ఎగువతాడికొండ గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. టిడిపి ఇంచార్జి తోయక జగదీశ్వరికి గిరిజనుల ఘనంగా స్వాగతం పలికారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు ప్రతి ఒక్కరికి అందాలంటే టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని జగదీశ్వరి అన్నారు. వైసీపీని గద్దెదించే వరకూ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి క్లస్టర్ కోఆర్డినేటర్ అడ్డాకుల నరేష్, మండల కార్యదర్శి పి.శ్రీనివాసరావు, నియోజకవర్గ నాయకులు నందివాడ కృష్ణబాబు ఉన్నారు.

సీతానగరం : మండలంలోని పనుకుపేటలో టిడిపి ఆధ్వర్యంలో ఇదేమి ఖర్మ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బి.చిరంజీవులు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారం వచ్చిన తర్వాత ఈ మూడు ఏళ్లలో నిత్యవసర ధరలు విపరీతంగా పెరిగాయని,సామాన్యుడు బతకలేని పరిస్థితి వచ్చింది అన్నారు. రైతుకు ధాన్యానికి అమ్ముకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ ప్రభుత్వానికి గద్దించే సమయం ఆసన్నమైందని అన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గర్బాపు ఉదయభాను, వాడాడ రాము, మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు కొల్లి తిరుపతిరావు, ఆర్.వేణుగోపాలనాయుడు. ఎస్.హరిగోపాలరావు, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలోని పొల్ల నాయకమ్మగూడ, టిటుకుపాయి, దుగ్గి పంచాయతీల్లో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని పాలకొండ నియోజకవర్గం ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యాన నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు సవర ముఖలింగం, మహిళా అధ్యక్షులు ఆరిక సువర్ణ, మండంగి ప్రకాశం, నాయకమ్మగూడ సర్పంచ్ బిడ్డిక అప్పారావు, రాష్ట్ర ఎస్‌టి సెల్ కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, మాజీ సర్పంచ్ కొండగొర్రి ఈశ్వరమ్మ,

సీతానగరం : పనుకుపేటలో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

తదితరులు పాల్గొన్నారు.

కీసరజోడులో...

మండలంలోని కీసరజోడు పంచాయతీలోని దిబ్బగూడ, బొక్కుడుగూడ, వెదుళ్లవలస, కీసరజోడు గ్రామాల్లో టిడిపి నాయకులు పడాల భూదేవి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం పై అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ మూడున్నర ఏళ్ల వైసిపి పాలనలో గిరిజనులకు ఒరిగేదేమి లేదని విమర్శించారు. అర్ధాంతరంగా నిలిచిన ఇళ్ల నిర్మాణాలు చూస్తుంటే బాధనిపిస్తుందన్నారు. విద్య, ఉపాధి కుంటి పడడంతో గిరిజనాభివృద్ధి మళ్లీ వెనక్కి వెళ్లందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు బిడ్డిక రామకృష్ణ, సవర మంగయ్య సీమల సుగ్రీవులు, కుంబ్రిక భాస్కరరావు, బిడ్డిక సీతయ్య, పత్తిక రవి, లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : తాడికొండలో ప్రచారం చేస్తున్న జగదీశ్వరి

సీతంపేట : టిటుకుపాయిలో ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

వ్యర్థాలను పరిశీలిస్తున్న కమిషనర్

రోడ్లపై వ్యర్థాలు వేస్తే చర్యలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

రహదారులపై భవన నిర్మాణాల వ్యర్థాలు వేస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ జె. రామఅప్పలనాయుడు హెచ్చరించారు. శుక్రవారం ఆయన పలు వార్డుల్లో కమిషనర్ శానిటరీ ఇన్స్పెక్టర్ సిహెచ్.మురళితో కలిసి వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించేందుకు పర్యటించారు. ఈ సందర్భంగా రహదారిపైన భవన నిర్మాణ వ్యర్థాలను వేసిన గృహ యజమానులతో మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజారోగ్య శాఖ అధికారులు, సిబ్బంది శాయశక్తుల కృషి చేస్తుంటే స్థానికులు ఇలా చేయడం దురదృష్టకరమని అన్నారు. ఈ వ్యర్థాలను వెంటనే రోడ్లపై నుంచి తొలగించాలని మరోసారి రోడ్లపై వేస్తే అపరాధ రుసుం వసూళ్లతో పాటు చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రతి కుటుంబానికి ఇళ్ల మంజూరు చేస్తుందని, అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలో రస్తా కుంటుబాయి పంచాయతీ సచివాలయం వద్ద సర్పంచ్ ఎం.సుజాత ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సభకు తహశీల్దార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ ఇల్లు లేనటువంటి కుటుంబాలు తప్పనిసరిగా హౌసింగ్ సిబ్బందికి దరఖాస్తు చేసుకుంటే ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని, కావున ఈ అవకాశాన్ని ప్రతి లబ్ధిదారుడు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రాంతంలో ఇళ్లు లేని నిరుపేద గిరిజనులను గుర్తించి ఇళ్ల స్థలాల మంజూరు చేస్తామని ఎల్విన్‌పేట సర్పంచి ఆర్.చైతన్య స్రవంతి

కురుపాం : గ్రామసభలో మాట్లాడుతున్న తహశీల్దార్ రమేష్‌కుమార్

తెలిపారు. ఎల్విన్‌పేట సచివాలయంలో గ్రామసభ శుక్రవారం నిర్వహించారు. ప్రభుత్వం అందించే ఇళ్లను పేదలందరికీ మంజూరు చేస్తామని చెప్పారు. ప్రతి పేదవాడు ఇళ్ల కలిగి ఉండేలా ప్రభుత్వ ఉద్దేశ్యం అన్నారు. పంచాయతీలో తాగునీటి కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. అర్హులైన వారందరికీ పింఛన్లు, రేషన్ కార్డులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాములమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్యామల ఉన్నారు.

బదిలీలపై స్పష్టత ఇవ్వాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

బదిలీల పేరుతో ఉపాధ్యాయులకు గందరగోళ పరిస్థితి నెలకొందని జిల్లా విద్యాశాఖాధికారులు స్పష్టమైన ప్రకటన చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి బాలకష్ణ, ఉపాధ్యక్షులు రావాడ అప్పలనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలోని కొందరు పాఠశాల సహాయకుల స్థాయి, ఉపాధ్యాయులు వారు బోధించాల్సిన సబ్జెక్ట్ మార్పు కోసం దరఖాస్తు చేశారన్నారు. వారికి ఇంకా మన జిల్లాలో ఉత్తర్వులు రాలేదన్నారు. వారు బదిలీలకు దరఖాస్తు చేసుకోవాలో వద్దో స్పష్టత లేదన్నారు. ఒకవేళ బదిలీకి దరఖాస్తు చేస్తే ఏ పోస్టుకు చేసుకోవాలో తెలియదన్నారు. మరి కొన్ని పాఠశాలల్లోని పాఠశాల సహాయకులు, గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందారని, వీరు ప్రస్తుతం పనిచేస్తున్న పాఠశాలల్లో అదే సబ్జెక్ట్ అదనంగా వున్నట్టు గుర్తించి నట్లయితే ఆ ఖాళీ పోస్టును వేరొక చోటుకు బదిలీ చేయాలని అన్నారు. కానీ పోస్టు పోతున్నట్లు చూపించడం సరికాదన్నారు. బదిలీలకు దరఖాస్తు చేయడానికి పాస్ వర్డ్ వచ్చినప్పటికీ కొందరికి ఎటువంటి వివరాలూ కనిపించడం లేదన్నారు. శనివారంలోగా బదిలీలకు దరఖాస్తు చేయాల్సి ఉన్నా ఇప్పటికీ ఈ అంశాలలో స్పష్టత లేకపోవడం ఉపాధ్యాయుల్లో ఆందోళన నెలకొందని ఆ ప్రకటనలో తెలిపారు. త్వరలోనే వీటికి స్పష్టత ఇవ్వాలని, అలాగే ఖాళీల వివరాలు నేటికీ విడుదల చేయకపోవడంతో బదిలీలకు గడువు పెంచాలని డిమాండ్ చేశారు.

ఫ్రెషర్స్ డే సభలో మాట్లాడుతున్న ఐటిడిఎ ఎపిఒ రోషిరెడ్డి

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రజాశక్తి - సీతంపేట

ర్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఐటిడిఎ ఎపిఒ రోషిరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక డిగ్రీ కళాశాలలో ఫ్రెస్సర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎపిఒ ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగి ఉన్నత శిఖరాలకు అధిరోహించాలన్నారు. ప్రత్యేక ఆహ్వానితులు సి.అశోక్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని అన్నారు. స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.జీవన్‌జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు సెలవులకు వెళ్లేటప్పుడు ఇంటి వద్ద కూడా క్రమశిక్షణతో చదువుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తల్లిదండ్రుల పత్తి విశ్వనాథం దంపతులను సన్మానించారు. వైస్ ప్రిన్సిపల్ ప్రభాకర్, అధ్యాపకులు నరేష్, శంకర్రావు, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రంధ్రం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చలివేంద్ర గ్రామ ప్రధాన రహదారిలో కల్వర్టుకు రంధ్రం ఏర్పడడంతో ప్రమాదకరంగా మారింది. ఇదే రహదారి గుండా మండలంలోని దశమంతపురం, నర్సిపురం గ్రామాలతో జియ్యమ్మవలస మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు నిత్యం వందలాది వాహనాల రాకపోకలు సాగిస్తున్నారు. వాహనదారులు ఏ మాత్రం అదుపుతప్పిన ప్రమాద బారిన పడి మృత్యువాత తప్పదు. ఇప్పటికైనా ఆర్అండ్‌బి అధికారులు తక్షణమే కల్వర్టుకు ఏర్పడిన రంధ్రాన్ని పూడ్చివేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రధాన రహదారిపై ఏర్పడ్డ గొయ్యి

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డిఎల్‌డిఒ గోపాలకృష్ణ

అర్జీలను పెండింగ్‌లో ఉంచొద్దు

ప్రజాశక్తి -వీరఘట్టం

స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలు పెండింగ్లో ఉంచరాదని, తక్షణమే సమస్య పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని డిఎల్‌డిఒ వి.గోపాలకృష్ణ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండలంలోని రేగులపాడు గ్రామ సచివాలయాన్ని సందర్శించిన అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఆధార్ అప్డేట్ చేయించాలని, భవన నిర్మాణ పనులు వేగవంతం చేసేందుకు చొరవ చూపాలని అన్నారు. సమయపాలన పాటించి విధిగా విధులకు హాజరు కావాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయనతో పాటు సచివాలయ డిడిఒ నిర్మల, సిబ్బంది ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

ప్రజాశక్తి -మక్కువ

ఉపాధి కోసం వలస బాట పట్టిన యువకుడు విద్యుత్‌షాక్‌కు గురై మృత్యువాత పడడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అల్లుకున్నాయి. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని తూరుమామిడి గ్రామానికి చెందిన సిరికి గోపాలరావు (25) గురువారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మనుగూరు ఉపాధి కోసం వెళ్లాడు. కొన్నాళ్లుగా అక్కడే ఉంటున్నాడు. గురువారం వాషింగ్ మిషన్‌లో బట్టలు వేసిన సమయంలో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. విషయం తెలుసుకున్న తల్లి అప్పలనరసమ్మ, సోదరుడు జగదీష్ బోరున విలపిస్తున్నారు. మృతదేహాన్ని స్వగ్రామమైన తూరుమామిడికి శనివారం తీసుకురానున్నారు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి

వ్యాపారవేత్తలుగా తయారు చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

వందన వికాస్ కేంద్రాల ద్వారా మహిళలను వ్యాపారవేత్తలుగా తయారీకి ప్రణాళిక రూపొందించాలని వైకెపి ఎపిడి వై.సత్యమనాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు మండల సమైక్య కార్యాలయంలో సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు వ్యాపారవేత్తలుగా తయారు చేసేందుకు అవసరమైన ప్రణాళికలు తయారు చేయాలని అన్నారు. విడివికె ద్వారా మండలంలో లభించే చింతపండు, ఇతర అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేసి వాటిని ప్రాసెస్ చేసి తిరిగి విడివికె ద్వారా అమ్మకాలు చేసేలా చూడాలన్నారు. చేయూత మహిళా మార్ట్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలు పరిశీలించాలని సూచించారు. అలాగే సిబ్బంది పనితీరును సమీక్షించారు. సమావేశంలో డిపిఎం అప్పారావు, ఎస్.సతీష్, రామకృష్ణ, చంద్రమోహన్, ఎపిఎం సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిడి సత్యంనాయుడు

పటేల్‌కు ఘన నివాళి

వీరఘట్టం : మండలంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతి వేడుకలు శుక్రవారం జరిగాయి. ఈ సందర్భంగా తలవరం, బొడ్లపాడు, నడుకూరు, కిమ్మి, వీరఘట్టం తదితర గ్రామ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, జనసేన నాయకులు పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయులు ఉప్పాడ అప్పారావు, ఎం.పారినాయుడు, పుండరికం, జనసేన జానీ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఏకలవ్య అథ్లెటిక్స్ పోటీలకు వ్యాయామ ఉపాధ్యాయుల ఎంపిక

ప్రజాశక్తి - విజయనగరం టౌన్

ఈనెల 17వ తేదీ నుండి 22వరకు గుంటూరు జిల్లా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరుగు మూడవ జాతీయస్థాయి ఏకలవ్య స్కూల్స్ పోటీలకు జిల్లా నుండి ఏడుగురు వ్యాయామ ఉపాధ్యాయులు టెక్నికల్ అఫీషియల్ గా ఎంపికయ్యారు. వీరిలో అనందకుమార్, తవిటినాయుడు, లీలాకృష్ణ, గురునాయు డు, రామకృష్ణ, గణేష్ కుమార్, చంద్ర మోహన్ ఉన్నారు.

అప్పయ్యపేటలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అప్పయ్యపేటలో ఉచిత వైద్య శిబిరం ఎంపిటిసి బురిడీ కుసుమ సూర్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి కె.శిరీష రోగులకు తనిఖీలు నిర్వహించారు. బిపి, సుగర్ రోగులకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో 104 సిబ్బంది దుర్గాప్రసాద్, ప్రసాద్, వైద్య సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యాధికారి శిరీష